సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

ఫుట్ పాట్లు..!

- మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా ఆక్రమణలు
- కాలిబాటలపై దర్జాగా వ్యాపారాల నిర్వహణ
- పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని జీవీఎంసీ, పోలీస్ సిబ్బంది


బీఆర్‌టీఎస్ రోడ్డుపైనే చిరు వ్యాపారాలు


షాపుల ముందు ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు

మర్రిపాలెం: రోజురోజుకూ ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు అడ్డు లేకుండా పోతోంది. కొందరు చిరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై ఇష్టానుసారంగా వ్యాపారాలు సాగిస్తుండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాల కారణంగా పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఏదో ఆసరా చూపించి, వారి జీవనానికి ఓ మార్గం చూపించేలా హాకర్ జోన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అలా చేయడం మానేసి చోద్యం చూస్తోందని పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు.

నడిచే వీలు లేకుండా..

మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో గంటల తరబడి ద్విచక్ర వాహనాలను పార్క్‌చేసి వదిలేయడం, ఫుట్‌పాత్‌లు ఆక్రమించడం వల్ల శాశ్వత దుకాణదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గృహ అవసర సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలు అటుగా నడిచి వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో నడిచే వీలు లేకుండా ఉందని, ఎవరైనా అడిగితే వ్యాపారులు దురుసు సమాధానాలు చెబుతున్నారని అంటున్నారు. గతంలో ఫుట్‌పాత్ వ్యాపారులు, రాంగ్ పార్కింగ్‌పై టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుని క్రమబద్ధీకరించే వారని, నేడు ఇటువంటివి పూర్తిగా గాలికొదిలేశారని మండిపడుతున్నారు. జీవీఎంసీ, పోలీస్ అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, రాంగ్ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన తోపుడు బండి

దుకాణదారుల గగ్గోలు

మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా ఆక్రమించేసి కొందరు వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇటు కరాస మొదలుకుని రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తుంటే కనీసం పట్టించుకునే నాథుడే లేడు. పాదచారులు నడిచేందుకు, వాహన చోదకుల రాకపోకలకు ఎంత ఇబ్బందిగా ఉన్నా.. జీవీఎంసీ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది వచ్చి హడావుడి చేసి ఒక రోజు తూతూ మంత్రంగా షాపులు తీయించేసి ముడుపులు అందగానే వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు వాహనాల పార్కింగ్, చిరు వ్యాపారాల ఏర్పాటు కోసమే నిర్మించినట్లుగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. మరో పక్క ఈ ప్రాంతంలో అసలైన దుకాణదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. తమ దుకాణాల ముందు రోడ్డుపై వ్యాపారాలు సాగిస్తుండటం వల్ల వాటిని దాటి తమ షాపులకు రావడానికి వినియోగదారులు ఇష్టపడటం లేదని అంటున్నారు. దుకాణాల ముందు వ్యాపారాలు నిర్వహించడం, వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వల్ల తమ వ్యాపారాలు సాగడం లేదని, స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని దుకాణదారులు వాపోతున్నారు.


మర్రిపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్వహిస్తున్న పూల వ్యాపారాలు

మూలకు చేరిన షోల్డర్ ప్రెస్


సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో పాడైన షోల్డర్ ప్రెస్ పరికరం

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సత్యం సెంటర్ వద్ద గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాల్లో ఒకటి విరిగిపోయింది. షోల్డర్ మజిల్స్ బలపడటానికి ఎక్సర్‌సైజ్‌లు చేసే షోల్డర్ ప్రెస్ పరికరం పైభాగంలో ఐరన్ రాడ్ విరిగిపోవడంతో రెండు నెలలుగా మూలకు చేరింది. గ్రీన్‌బెల్ట్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలతో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక యువత, మహిళలు, పిల్లలు వ్యాయామాలు చేస్తుంటారు. రెండు నెలలుగా షోల్డర్ ప్రెస్ మూలకు చేరినా.. ఎవరూ పట్టించుకోలేదని, ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియదని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి షోల్డర్ ప్రెస్ పరికరానికి వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

వినాయక నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట


అక్కయ్యపాలెంలో ఉత్సవ రాట వేస్తున్న నిర్వాహకులు, మహిళలు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్‌టీ స్కూల్ కూడలి వద్ద న్యూఫ్రెండ్స్ సంపత్ వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా గురువారం పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, స్థానిక మహిళలు రాట వేశారు. వినాయక చవితి నుంచి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకుడు బసరమాని జగదీష్ తెలిపారు. 36వ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో 6 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గురువారం నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ పి.శివనారాయణ తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ బులందసహార్ జిల్లాకు చెందిన అజయ్ విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.30 వేల విలువైన 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

మనవడికి వృద్ధురాలి అప్పగింత


వృద్ధురాలు లక్ష్మమ్మను మనవడికి అప్పగిస్తున్న ఆశ్రమ నిర్వాహకురాలు మమత

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ చేపట్టిన జ్యోతిర్గమయ కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. నగరంలో యాచకులుగా తిరుగుతున్న వారిని రెస్క్యూ చేయటంతో వారి మూలాలు బయట పడుతున్నాయి. వన్ టౌన్ ప్రాంతంలో జామి లక్ష్మి అనే వృద్ధురాలి పాదానికి ఇన్‌ఫెక్షన్ అయ్యి వర్షంలో తడుస్తుండగా సీపీ శంఖబ్రత బాగ్చి గుర్తించారు. ఆమెను వన్ టౌన్ పోలీసుల సాయంతో మాతృప్రేమ వృద్ధాశ్రమానికి పంపించారు. ఆశ్రమ నిర్వాహకురాలు మమత ఆమెకు సపర్యలు చేసి, ఆశ్రయమిచ్చారు. వివరాలు ఆరా తీసి.. విజయనగరం జిల్లా నరవలో ఉంటున్న ఆమె మనవడు రాయి మోహన్‌ను ఆశ్రమానికి పిలిపించారు. కంచరపాలెం పోలీసుల సమక్షంలో లక్ష్మమ్మను మనవడికి గురువారం అప్పగించారు.

నదుల అనుసంధానంతో దేశాభివృద్ధి


దీక్ష చేస్తున్న సంఘమిత్ర సూరిబాబు

బీచ్‌రోడ్డు: దేశంలోని జీవనదులను అనుసంధానం చేస్తే అద్భుతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, తద్వారా అమెరికాను కూడా అధిగమించవచ్చని సంఘమిత్ర సూరిబాబు అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం మూడు రోజుల దీక్షను ఆయన ప్రారంభించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి సూరిబాబుకు పూలమాల వేసి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ నాగావళి, సువర్ణముఖి, వేగవతి, గోస్తాని వంటి నదులను అనుసంధానం చేయడం వల్ల ఉత్తరాంధ్ర రైతులు కరువు అనే మాటను పూర్తిగా మర్చిపోతారన్నారు. నీటి కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండవని, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఒక కొత్త దశ మొదలవుతుందని చెప్పారు. భారతదేశంలో సహజ వనరులు ఉన్నప్పటికీ, నదుల అనుసంధానం కేవలం రాజకీయ వాగ్దానాలకే పరిమితం కావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ, ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు సూరప్పడు, తులసి, ఆశ, దుర్గ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

నయవంచనే కూటమి ప్రభుత్వ నైజం


45వ వార్డులో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న పైడి రమణ, పార్టీ నాయకులు


42వ వార్డులో కూటమి మోసాలను వివరిస్తున్న అందిస్తున్న భీశెట్టి ప్రసాద్, పార్టీ నాయకులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. 60వ బూత్ పరిధి లక్ష్మీనారాయణపురం–2, వాసుదేవ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి మాట తప్పిన, హామీలు అమలు చేయలేని కూటమి ప్రభుత్వం తీరును ప్రజలకు కరపత్రాలు అందించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరిపట్నాయక్, నానిబాబు, దుర్గేష్, గణపతి, నాయుడు, నేపాల్ శ్రీను, పైడి శ్రీను, కత్తుల ప్రభాకరరావు, ఎగ్గిన రాఘవ, బొత్స తవుడు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 42వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. 9, 10 బూత్‌ల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏ విధంగా మాట తప్పిందో, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.శ్రీనివాసరావు, మాధవ, కె.వి.ఆర్.మూర్తి, మురళీ, సబ్బి నూకరాజు, వెన్నెల కృష్ణవేణి, నాగమణి, రత్నం, కనకమహాలక్ష్మి, వెంకటేష్, గణేష్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ టీటీఐలకు సత్కారం


ట్రైన్ టికెట్ తనిఖీ సిబ్బందిని సత్కరిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, సీనియర్ డీసీఎం సందీప్

తాటిచెట్లపాలెం: వాల్తేరు రైల్వే డివిజన్ టికెట్ తనిఖీ సిబ్బంది మే నెలలో రికార్డు స్థాయిలో ఆదాయం సాధించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు డివిజన్ పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన సిబ్బందిని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా సత్కరించారు. మే నెలలో టికెట్ తనిఖీ సిబ్బంది వివిధ రూపాలలో రూ.2,41,20,627 ఆదాయాన్ని ఆర్జించారు. గత సంవత్సరం మే నెలలో సాధించిన రూ. 2,27,34,221 ఆదాయంతో పోలిస్తే, ఈసారి అధిక ఆదాయాన్ని నమోదు చేశారు. ఈ రికార్డు ఆదాయం సాధించడంలో వ్యక్తిగతంగా ఇద్దరు ఉద్యోగులు అద్భుతమైన పనితీరు కనబరిచారు. విజయనగరం, టీటీఐ వై. అప్పలరాజు.. 836 కేసులు నమోదు చేసి రూ. 4,89,320 జరిమానాలు, అదనపు టికెట్ రుసుముగా వసూలు చేశారు. శ్రీకాకుళం రోడ్డు టీటీఐ కె. శ్రీనివాసరావు 815 కేసులు నమోదు చేసి రూ. 4,42,900 వసూలు చేశారు. వీరిని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ సమక్షంలో సత్కరించారు.

నిరాశ్రయ మహిళకు మానసిక చికిత్స


శాంతాదేవిని మానసిక వైద్యశాలలో చేర్పించిన కేర్ టేకర్ లీలావతి

అల్లిపురం: ఏయూటీడీ ఆధ్వర్యంలో టీఎస్సార్ కాంప్లెక్స్‌లో నడుస్తున్న మహిళల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న ఓ మహిళను చికిత్స నిమిత్తం ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఈ నెల 14న 'మిషన్ తమసోమా జ్యోతిర్గమయ'పేరిట నిర్వహించిన కార్యక్రమంలో శాంతాదేవి(55)ని రెస్క్యూ చేశారు. పేరు తప్ప ఏమి చెప్పలేక పోవటంతో ఆమెకు ఏయూటీడీ కార్యదర్శి పి.వాసుకు అప్పగించారు. ఆమె మానసిక పరిస్థితి బాగాలేనందున, మూడు రోజులుగా అరిచి గొడవ చేస్తుండటంతో చికిత్స నిమిత్తం మానసిక ఆస్పత్రిలో గురువారం చేర్పించినట్లు ఏయూటీడీ కేర్ టేకర్ లీలావతి తెలిపారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు


నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం 33/11 విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మహారాణి పార్లర్, శంకువానిపాలెం, మసీదు ఏరియా, 80 ఫీట్ రోడ్, మున్సిపల్ స్కూల్ ఏరియా, నరసింహనగర్, గణేష్‌నగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, కైలాసపురం, శాంతినగర్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

డీఆర్‌ఎంను కలిసిన ఎమ్మెల్యే

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రాను దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కలిశారు. ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గంలోని ధర్మానగర్, తిక్కవానిపాలెం, గాంధీనగర్ ప్రాంతాలకు సంబంధించిన సమస్యలపై డీఆర్‌ఎంకు వినతిపత్రం అందించారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఆర్‌ఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో బోధించుటకు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం అంతకంటే ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులై నెట్/స్లెట్/పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు వారి విద్యార్హత, బోధానుభవం, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ సెట్‌తో డెమో క్లాస్‌కు సిద్ధపడి ఈ నెల 23న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాల్సిందిగా కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సాగర్ మృతదేహం

బీచ్‌రోడ్డు : బీచ్ రోడ్డులో సబ్ మెరైన్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూర్ణా మార్కెట్ ప్రాంతానికి చెందిన కె.సాగర్(26) స్నేహితుడితో కలిసి పార్క్ హోటల్ నుంచి ఆర్కే బీచ్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ముందు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో ఆ వాహనాన్ని సాగర్ ఢీకొట్టి కింద పడిపోయాడు. హెల్మెట్ లేకపోవడంతో సాగర్ తలకు తీవ్రగాయమై చికిత్స పొందుతూ గంట వ్యవధిలోనే మరణించాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


అక్కయ్యపాలెం హైవే వద్ద గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్న కార్మికులు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు పరిధిలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతానికి రక్షణగా ఫెన్సింగ్ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 24, 25, 44 వార్డుల పరిధిలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతానికి రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పార్కులు, వాకింగ్‌ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లతో ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. 26వ వార్డులో మాత్రం గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. ఫెన్సింగ్ లేక గ్రీన్‌బెల్ట్‌లో పచ్చదనం మాయమై అధ్వానంగా మారింది. ఈ సమస్యపై 'గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కరువు' అనే శీర్షికన ఈ నెల 1న 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి స్పందించారు. అధికారులతో మాట్లాడి ఫెన్సింగ్ వేసేలా చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల నుంచి అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద గ్రీన్‌బెల్ట్‌కు ఐరన్ ఫెన్సింగ్ అమర్చుతున్నారు. ఉన్న చెట్లు తొలగించకుండా గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని పార్కులుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్మార్ట్ స్ట్రక్చర్ రూపకల్పనలో నానో టెక్నాలజీ


మాట్లాడుతున్న ఎన్‌ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ సురేష్‌కుమార్

మురళీనగర్: కార్బన్ నానోట్యూబ్స్, ఫైబర్ నానో కంపోజిట్స్ వంటి ఆధునిక పదార్థాల వాడకం స్మార్ట్ స్ట్రక్చర్స్ రూపకల్పనలో కీలకమని రాయపూర్ ఎన్‌ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సురేష్‌కుమార్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)లో గురువారం ఆయన పాల్గొని 'స్మార్ట్ స్ట్రక్చర్స్–ఏ డిజైన్ థింకింగ్ పర్‌స్పెక్టివ్' అనే అంశంపై ప్రసంగించారు. నానో టెక్నాలజీ వల్ల ఉత్పత్తుల పనితీరు, దీర్ఘాయువు, విశ్వసనీయత గణనీయంగా పెరుగుతాయన్నారు. స్మార్ట్ మెటీరియల్స్, సెన్సార్లు ఆధునిక నిర్మాణ పద్ధతుల రూపకల్పనలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయని వివరించారు. డిజైన్ థింకింగ్ ద్వారా ఏరోస్పేస్, సివిల్ ఇంజినీరింగ్, బయోమెడికల్ రంగాల్లో వినూత్న పరిష్కారాలను కనుగొనవచ్చని పేర్కొన్నారు.

డిజైన్ థింకింగ్ ఆధారంగా బోధన

టీసీఎస్ ఫార్మర్ స్ట్రాటజిక్ అడ్వైజర్ డాక్టర్ మోహన్ కంచర్ల 'రీ ఇమాజిన్ టీచింగ్ టు రీఇగ్నైట్ లెర్నింగ్' అనే అంశంపై ప్రసంగించారు. బోధనాభ్యసనలో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. డిజిటల్ లెర్నింగ్, ఇంటరాక్టివ్ పద్ధతులు, డిజైన్ థింకింగ్ ఆధారంగా బోధనను పునర్నిర్మిస్తే విద్యార్థుల ఆసక్తి పెరిగి, స్వయంగా నేర్చుకునేందుకు ఉత్సాహం చూపుతారన్నారు. ఇంజినీరింగ్ విద్యలో ఫ్యాకల్టీ సభ్యులు కొత్త బోధనా పద్ధతులు అవలంబించడం ద్వారా పరిశ్రమ అవసరాలకు సరిపోయే ప్రతిభను విద్యార్థుల్లో పెంపొందించవచ్చన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్, కో–కో ఆర్డినేటర్‌లు డాక్టర్ సిహెచ్.రాజు, ఎం.భరణి పాల్గొన్నారు.

జూ పార్కుకు ఐవోబీ వితరణ


జూలో ఏర్పాటు చేసిన బెంచీలను ప్రారంభిస్తున్న రవికుమార్ గుప్తా, మంగమ్మ

ఆరిలోవ: ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐవోబీ) కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్సార్)లో భాగంగా ఇందిరాగాంధీ జూ పార్కుకు సహకారం అందించింది. ఇందులో భాగంగా సందర్శకుల సౌలభ్యం కోసం జూలో 25 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసింది. వీటిని గురువారం ఐవోబీ రీజినల్ మేనేజర్ రవికుమార్ గుప్తా, జూ క్యూరేటర్ జి.మంగమ్మ ప్రారంభించారు. ఈ బెంచీలను జూలో పలుచోట్ల సందర్శకులకు వీలుగా ఉండేలా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ ఐవోబీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐవోబీ చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, పలు బ్రాంచ్‌ల అధికారులు సుష్మా, కె.మురళి, పి.శ్రీనివాసరావు, జూ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.ఉమాదేవి, అసిస్టెంట్ క్యూరేటర్ బి.గోపి, సీనియర్ అకౌంటెంట్ కె.సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి సంగీత నృత్యోత్సవాలు

మద్దిలపాలెం: కళాభారతి ప్రాంగణంలో ఈ నెల 23 నుంచి 28 వరకు సంగీత, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్ రాజు, రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమాల పోస్టర్‌ను గురువారం కళాభారతి ఆడిటోరియంలో ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. ఈ నెల 23న వయోలిన్ విద్వాంసుడు ద్వారం దుర్గాప్రసాద్ రావుకు 'నాద విద్యా భారతి' బిరుదు, రూ.లక్ష నగదు, రూ.2.5 లక్షల విలువైన స్వర్ణకమలం బహూకరించి సత్కరిస్తారు. గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు ఈ సత్కారాన్ని అందజేస్తారు. అనంతరం ద్వారం సత్యనారాయణచే వాయులీన కచేరీ ఉంటుంది. 24న హిందుస్థానీ, కర్ణాటక గాత్ర సంగీతంలో పూర్ణిక కృష్ణన్(ముంబై), నివేదిత భట్టాచార్య (కోల్‌కతా)ల జుగల్బందీ కార్యక్రమం జరుగుతుంది. 25న ప్రముఖ కర్ణాటక గాత్ర విద్వాంసులు విష్ణుభట్ల సిస్టర్స్ గాత్ర యుగళం ప్రదర్శన ఏర్పాటు చేశారు. 26న బెంగళూరు బ్రదర్స్‌చే కర్ణాటక గాత్ర సంగీత కచేరీ, 27న డాక్టర్ ఆర్. వసంత కిరణ్ ఆధ్వర్యంలో 33 మంది కళాకారులు 'హరిలీలా కల్పతరువు' అనే కూచిపూడి నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారు. 28న డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి 'శ్రీ ఖడ్గ తిక్కన' అనే గొప్ప చారిత్రక పద్య నాటకాన్ని 38 మంది నటీనటులు ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమాలకు ప్రవేశం ఉచితం. కార్యక్రమంలో అకాడమీ కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, గ్రంథి మల్లికా మనోజ్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com